# ఎత్తుపై యెత్తు

శ్రీ జొన్నలగడ్డ వేంకటరాధాకృష్ణయ్య

ప్రేమ అనేది ఇలా ఉంటుందని వర్ణించడం ఎవ్వరి తరమూ కాదు. అనుభవించినవారికే గాని, దానిలోని మహత్తరమూ, ప్రచండమూ అయిన శక్తి ఇతరులకు తెలవదు. ప్రేమ ఎన్ని పనులైనా చేయిస్తుంది. ఎన్ని ఉపాయాలైనా తోపిస్తుంది. ఎన్ని జిత్తులైనా తలపుకు తెస్తుంది. కవిగానీండి—కథకుడు గానీండి, చిత్రకారుడు, శిల్పి కానీయండి—వేదాంతి కానీండి వితంతువు కానీండి ప్రేమతత్త్వాన్ని ఉన్నదున్నట్లునిర్వచించడం దుర్లభం!

◆ ◆ ◆

రాజమండ్రిలో బాలయ్య అభినవ కుబేరుడు. బాలయ్య భార్య రాజరత్నం. రాజరత్నం అందగత్తె. శిరీషకుసుమం కంటెకూడా కోమలంగా ఉంటుంది. కలువరేకుల్లా కళ్లు విశాలంగా ఉంటాయి. పదహారు పదిహేడు సంవత్సరాలు మించని వయస్సులో ఉండేమో, మిసమిసలాడుతూ వెన్నఅప్పంలా ఉంటుంది. నిజంగా షికారు వంకనో దేవేంద్రుడు నందనోద్యానవనాన్నుంచి ఓసారి భూలోకంవంక దృష్టిసారించాడా బాలయ్య మేడమీదికి, మరి అక్కణ్ణుంచి క్రిందకు ఒకే ఒక ఉరుకున వచ్చి వ్రాలుతాడు. ఏకోడిగానో, కుక్కగానో మారి విరహానలం భుగభుగ విరజిమ్మ ఎక్కడలేని యాతనా పడతాడు.

అదే అగ్గిపుల్ల బిరుదాంకితుడు నారదస్వామి చూశాడా, వెంటనే ఏబకాసురుడు దగ్గరికో, హిరణ్యకశిపుడి దగ్గరికో పరుగెత్తి ఊదేస్తాడు రాజమండ్రిలో బాలయ్య పెళ్లాం బహు బాగైనపిల్ల సుమా అని. దానితో అంటుకుంటుంది అగ్నిజ్వాల. ఇప్పుడు ప్రపంచాన్ని కల్లోలంచేస్తున్న యుద్ధాన్ని మించిన ప్రచండ దేవదానవ యుద్ధం ఆరంభమవుతుంది. ఇంతకు చెప్ప వచ్చేది ఆమె అంత చక్కనిచుక్క సుమా అనడానికి ఇంతా చెప్పవలసి వచ్చింది.

◆ ◆ ◆

రాజరత్నం అందాన్ని చూసి, మురిసిపోయేవాడు బాలయ్య. అతనికి ఎంతో గర్వంగా ఉండేది అంత అందమైన భార్య దొరికినందుకు. ఆమె తలిదండ్రులకు కట్నానికి బదులు తాను రెండువేలిచ్చి తెచ్చుకున్నాడు. అయితే ఆ అందవికారమైన—స్ఫోటకపడిన భర్త ముఖాన్ని— విఘ్నేశ్వరుడే నయమనిపించే ఆ పెద్ద బొజ్జనుచూసి అసహ్యించుకొనేది రాజరత్నం. విధిలేక మాట్లాడేది. లోలోపల కుళ్లేది. కాని పైకి తేలేదికాదు. అందమైన పెళ్లాంకాదూ—బాలయ్య వర్తకంచేసుకుంటూన్నా, దృష్టి ఎప్పుడూ యింటిమీదనే— భార్యమీదనే ఉండేది. ఏంచేస్తూ ఉంటుందో అని శంకతో బాధపడేవాడు. వ్యాపారం చూసిచూసి వదలలేడు. భార్యనింటిదగ్గర విడిచి, నిశ్చింతగా ఉండలేడు. ఈలా ఆందోళనపడేవాడు. ఆఖరుకు ఆందోళన అతిశయించింది. హృదయంలో శాంతిలేకుండా పోయింది. ఎందుకు అందమైన భార్యను కట్టుకున్నానా అని అహర్నిశలూ పరితపించ సాగాడు. ఆఖరుకు ఆమెను చూస్తే కలిగే ఆనందం అసూయగా మారింది. ఆఅసూయ అగ్నిహోత్రంలా అతణ్ని దహించ మొదలుపెట్టింది. భార్య కనబడితేసరికి కొరకొరలాడేవాడు. మాట్లాడబోతే మండిపడేవాడు. చిరచిరలాడుతూ చికాకుతో—తిట్టేవాడు— నాకొంపకి శనిలా దాపురించావే అని— 'ఊరందరి కళ్ళూ నీమీదనే ఉంటా'యనీ అనేవాడు. ఇంట్లో నేను లేనప్పుడు నీ యిష్టంవచ్చినట్లు సంచరిస్తున్నావనేవాడు. తలుపు తీసి ఉంటే— వెయ్యలేదేమని కొట్టేవాడు. వేసిఉంటే— తలుపులు బిడాయించుకుని కులుకుతున్నావా అని మొట్టేవాడు.

◆ ◆ ◆

ఆమాటలు రాజరత్నం మనస్సును శూలాల్లా నొప్పించేవి. అతని చీదరబాటునుచూసి, మరీ అసహ్యించుకో సాగింది. ఆబాధ భరించలేక పోయింది. అంతకు ముందు లోకానికి వెరచి మాటలూపడేది. తిట్లూ తిట్టేది. దెబ్బలూ కాసేది. ఆఖరుకు మనస్సులో మంట బయలుదేరింది. మగని అనుమానానికి తగినట్లే సంచరించి, బుద్ధి వచ్చేలా చెయ్యాలనుకుంది.

అదివరకు బాలయ్య అప్పుడప్పుడు కొంచెంగా బ్రాందీపుచ్చుకునేవాడు. భార్యమీద అనుమానం ఎక్కువైనాక, మోతాదు హెచ్చించాడు. కొన్నాళ్లకు వ్యాపారం గుమాస్తా చేతులమీద వదిలేసి, ఇరవైనాలు

గంటలూ అదే త్రాగడం— భార్యను చితకగొట్టడం ఆరంభించాడు.

రాజరత్నం నిశ్చయించుకుంది. ఆ వీధిలోనే రామారావు కాపరం. ఇరవైనాలుగేళ్లుంటాయి. కాలేజీలో చదువుతున్నాడు. ఎప్పుడూ, సూటూ, బూటూ, హేటుతో టిప్‌టాప్‌గా తయారై, సైకిలుమీద కాలేజీకి వెళుతూన్నప్పుడూ వస్తూన్నప్పుడూ తనవైపు, (మేడమీద నిలబడ్డప్పుడు) అదేపనిగా చూసేవాడు. పైగా రూపసి.

అన్నాళ్ళూ అతనలా చూస్తూవుంటే సిగ్గుపడి వెనక్కు తగ్గేది. ఇప్పుడు ముసిముసినవ్వులు ప్రారంభించింది. అతను యికిలిస్తే తను సకిలించేది. అతను బాహాటంగా చూస్తే, తను క్రీగంట మోహావిలమైన ఒక ఒక దృక్బాణం వదిలేది. అతడు నిరాశగాచూస్తే తను కన్నీళ్ళు కార్చేది. అతడు 'యీ వియోగం ఎన్నాళ్ళ'న్నట్టు చూస్తే, 'కొద్దిరోజులే' అన్నట్టు కళ్లింతింత చేసుకుని ఆప్యాయనంగా చూసేది.

ఆఖరుకు మన్మథుడు వారిచూపుల్ని మాన్పేసి తన శక్తిఅంతా ఉత్తరాలమూలంగా చూపేవాడు. రాజరత్నం ప్రేమఅంతా ఉట్టిపడేటట్లు— ఏవేవో ఆశలతో మూడుపేజీల ప్రేమలేఖ రాస్తే రామారావు పదిపేజీలు రాసిపంపేవాడు. అతడు తినుబండారాలంపితే, ఆమె కవర్లో అయిదేసి రూపాయల నోట్లు పంపేది. నలదమయంతులమధ్య హంసలా, వీళ్ళిద్దరిమధ్యా యీ లవ్‌లెటర్సు మోయడంలో దాసీ లక్ష్మి అటూ యిటూకూడా దసరామామూళ్లు సంక్రాంతిమామూళ్లు నిత్యమూ పడుక్కునేది.

ఇంక ఆ ప్రేయసీ ప్రియులు అవకాశంకోసం చూడ్డం మిగిలింది. మిగిలిన తంతు అంతా పూర్తయింది.

♦ ♦ ♦

బాలయ్య త్రాగడం మితిమీరింది. రాజరత్నం యిది మానమనలేదు. పైగా యింకా ప్రోత్సహించేది. ప్రొద్దున్న పదిగంటలకు తెగత్రాగి, ఒళ్లు తెలియక బాలయ్య సాయంకాలంవరకూ పడివుండేవాడు. దొరికిందే సందని రాజరత్నం రామారావుతో హాయిగా— కులాసాగా ఆనందించడం ఆరంభించింది. ఒక్కొక్కప్పుడు ఆమె రామారావు యింటికే వెళ్లిపోయేది. ఆ యిద్దరూ ప్రేమసాగరంలోపడి యీదడంలో దరిదాపు కనబడటంలేదు.

ఇలా కొన్నాళ్లు జరిగిపోయింది. బాలయ్య క్రమంగా గ్రహించాడు. భార్య తన్ను త్రాగమని ప్రోత్సహిస్తున్నదేగాని, తాను ఒక చుక్కయినా తాగేదికాదని. త్రాగినట్లు నటించి, ఎక్కడకో పోతున్నదని అనుమానించాడు. నిజమో అసత్యమో తన అనుమానం అని ఓనాడు చిన్న ఉపాయం యోచించాడు. ఆనాడు తాను తప్పత్రాగినట్లు నటించాడు. పడుకున్నాడు. రాత్రి 10 గంటలయింది. రాజరత్నం ఓసారి తనదగ్గరకువచ్చి, చూసింది. పెట్టెతీసింది. చీరకట్టింది సిల్కుజాకెట్ ధరించింది. స్నోరాసుకుంది. మెల్లగా బయలుదేరింది. వీధితలుపు తెరిచింది. బయటగొళ్లెంపెట్టి తాళంవేసింది. రామారావింటికి చక్కాపోయింది.

♦ ♦ ♦

బాలయ్య లేచాడు. ఇదాసంగతన్నాడు. పళ్లు పటపట కొరికాడు. కళ్లు ఎర్రనైనాయి కోపంతో. కోపం హెచ్చడానికి కొంచెం త్రాగాడు. కొట్టడానికి మూలఉన్న కర్రతీశాడు, అవసరమైతే చంపేదామని బాకు తీశాడు, పదునుగా ఉందో లేదో అని ఓసారి చూశాడు. ఆచూడటంలో చెయ్యి తెగింది. ప్రక్కమీద ఉన్న భార్య చీరచించి, కట్టుకట్టుకున్నాడు. ఎప్పటికి వస్తుందో అని వీధితలుపుకు లోపల గొళ్లెంవేసుకుని— ఆ ఆయుధాలతో కిటికీదగ్గరనే కూర్చున్నాడు. కునికిపాటు వచ్చినప్పుడల్లా బుడ్డిలోది కొంచెం నోట్లో పోసుకునేవాడు.

♦ ♦ ♦

గడియారం టంగ్ టంగ్ మని రెండు కొట్టింది. రాజరత్నం తిరిగివచ్చింది. తాళంతీసి గెంటింది తలుపు. తెరవలేదు. త్రోసింది. ఊహుం;

"ఎవరది?" అన్నాడు బాలయ్య.

"నేనండి, తలుపు తీయండీ" అంది రాజరత్నం. కాని గుండెలు కొట్టుకుంటున్నాయి.

"తీయను. వెళ్లు. ఇదా నీనాటకం. పదే, ఎక్కణ్ణుంచి వచ్చావో అక్కడికే వెళ్లు. నీ బ్రతుకు బయటపడే రోజు యిన్నాళ్లకు వచ్చిందే. ఇది మీ బంధువులకు— ఇరుగుపొరుగువాళ్ళకూ తెలియాలి. నీ రోగం కుదరాలి" అన్నాడు బాలయ్య.

రాజరత్నం బ్రతిమాలింది. ఎవరో స్నేహితురాల్ని చూడ్డానికి వెళ్లానంది. అక్కడ రేడియో పాడిందట. అది వింటూంటే ఆలస్యమైపోయిందట.

ఆమె భర్త ఊళ్ళోలేడుట. ఇలా ఎన్నో ఎన్నెన్నో చెప్పింది కాని ససేమిరా అన్నాడు బాలయ్య. బ్రతిమాలడంవల్ల ప్రయోజనంలేదని ఆమె గ్రహించింది. బెదిరించింది "తలుపు తీస్తావా, తియ్యవా? తాగుబోతువని—తిట్టికొట్టావని అల్లరిచేస్తాను. లేకపోతే నీ అంత దుర్మార్గుడు లేడని ఊరంతా తిట్టేటట్లు చేస్తా"నంది.

"ఎల్లాగా?" అన్నాడు చల్లగా, బాలయ్య.

"ఈ నూతిలోపడి చస్తాను"

"శని విరగడైపోతుంది."

"తీయవూ?"

"ఊహు!"

"సరే, ఓయి దేముడా పరాయివాళ్లకేనావద్దు ఇలాంటి పాపిష్టి మొగుడు" అంటూ రాజరత్నం, అక్కడఉన్న నూతిదగ్గరకు వెళ్ళింది. ప్రక్కనే బట్ట ఉతకడానికి ఉంది ఓ పెద్దరాయి. ఎలాగోఎత్తి గభాలున ఆనూతిలో పారవేసింది. దభేలుమంది బాలయ్య భయపడ్డాడు. నిజంగాపడిపోయిందని తలుపు తీశాడు లాంతరుతో ఇవతలకు వచ్చాడు.

అదే సమయమని, ఆ తలుపుప్రక్కనే తిన్నె ప్రక్క దాగిఉన్న రాజరత్నం లోపలకు వెళ్లింది. తలుపు బంధించి అక్కడనే కూర్చుంది.

బాలయ్య నూతిదగ్గర పదినిమిషాలు నిలబడ్డాడు. ఏమీ తేలలేదు. అతనికి ఏమీ పాలుపోలేదు. ఇంటివైపు చూశాడు కిటికీదగ్గర ఉంది భార్య. తలుపుత్రోశాడు. రాలేదు. తియ్యమన్నాడు.

"ఊహు!"

"తియ్యవేం మొద్దులాగా?"

"తప్పత్రాగడం చాలక ఇంకా అల్లరిచేస్తావేం? కల్లు చాలక నీళ్ళుకూడా కావలసి వచ్చాయా? తియ్యను."

బాలయ్య బ్రతిమాలాడు. ఆమె వినలేదు. గొంతెత్తి ఆరంభించాడు తిట్లు. ఆ కేకలు విని యిరుగు పొరుగువారు ఓ యాభైమంది పోగైనారు. "ఏమిటి బాలయ్యా! అర్ధరాత్రివేళ అంకమ్మశివాలు?" అని ప్రశ్నించారు.

రాజరత్నం ఏడుస్తూ చెప్పింది:—

"రోజూ తప్పత్రాగి—అపరాత్రివేళ యింటికి వచ్చి చావకొడుతున్నాడు. ఎన్నాళ్ళని యీ బాధలు భరించను చెప్పండి, ఆఖరుకు తలుపు తియ్యకపోతే బుద్ధయినా వస్తుందేమోనని ఇలా చేశాను."

రాజరత్నం రాగాలు ఆరంభించింది, బాలయ్య జరిగినదంతా చెప్పాడు. ఆమె మళ్లీ అందుకుంది—"చూశారా ఆ అన్యాయపు మాటలు—ఆ నీలాపనిందలు! నేనే నిజంగా వీధిలోఉండి—అతడే ఆమాటలు చెబితే మీరు నమ్మరూ? ఆ నుయ్యేమిటో—అపడట మేమిటో చూశారా? ఆ త్రాగిన మత్తుమీద ఆడే మాటలు?"

అందరూ బాలయ్యను మందలించారు. నీదే తప్పన్నారు. అసలైన ఇల్లాలును ఏడిపించడం తగదన్నారు. చీవాట్లు పెట్టారు. ఈ గొడవ ముగిసేసరికి తెల్లవారింది. ఆమె తల్లిదండ్రులూ, బంధువులూ వచ్చారు. ఆమెను తీసుకుపోయారు.

♦ ♦ ♦

బాలయ్య ఒక్కడూ ఉండలేక పోయాడు. ఇంట్లో వండిపెట్టే దిక్కు లేదు. భార్యకోసం మామగారింటికి వెళ్లాడు, 'పంపం' అన్నారు-బ్రతిమాలాడు, ఎప్పుడూ ఏమీ అనన్నాడు ఏంచేసినా సరే చూస్తూ ఊరుకుంటానన్నాడు. ఇంటిల్లిపాదీని క్షమార్పణ కోరుకున్నాడు. భార్యను యింటికి తీసుకువచ్చాడు.

♦ ♦ ♦

బాలయ్య త్రాగుడూ మానలేదు, రామారావు రావడమూ............


## మహాలక్ష్మీ కవచము

మంత్రబద్ధమైన యీ తాయెత్తు ధరించిన స్త్రీ పురుషులకు పరస్పరప్రేమ, నిరుద్యోగుల కుద్యోగము, విద్యార్థులకు పరీక్షలందు జయము, వర్తకులకు వ్యాపారవృద్ధి, సంతానహీనులకు సత్సంతానము కలిగి, తలచిన కోర్కెలు ఫలించును. వెల పోస్టేజి సహా రు. 2-0-0 వెండికవచం రు. 3-12-0.

వసంతాశ్రమము: 1/26.
రాయపేట హైరోడ్డు,
రాయపేట : : మదరాసు.